

### హైపర్.. హైపవర్

వినియోగదారులకు నాణ్యమైన, మెరుగైన, అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం చర్యలు చేపట్టింది. - 8లో



### పీహెచ్‌డీ వేకెన్సీలన్నీ భర్తీ చేయాలి..

కేయూలోని పీహెచ్‌డీ వేకెన్సీలను భర్తీ చేయాలని పీహెచ్‌డీ ఆశావహ అభ్యర్థులు రిజిస్ట్రార్ మల్లారెడ్డితో వాగ్వాదానికి దిగారు. - 8లో

### వాతావరణం

గరిష్టం/కనిష్టం $36^0/27^0$

ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అధికశాతం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు మామూలుగా ఉంటాయి.

## న్యూస్‌రీల్

### నాన్న స్థానం అత్యంత విశిష్టమైనది



**జనగామ రూరల్:** జీవితంలో నాన్న స్థానం అత్యంత విశిష్టమైనది.. కుటుంబం కోసం అలుపెరుగని పోరాటం చేస్తాడని జిల్లా కవులు, కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు జి.కృష్ణి అన్నారు. సోమవారం పెంబర్తిలో హస్త కళాకారులు అయిలా పరమేశ్వరాచారి 50 వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం పలువురు కవులు, ఆత్మీయులకు సత్కారం చేశారు. ఐలా సోమనర్సింహాచారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభాకర్, భాస్కర్, జనార్దన్, సాయికిరణ్, సదానందం, మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### చదువుకున్న స్కూల్‌కే హెచ్‌ఎంగా..



**చిల్పూరు:** చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన శాగ శ్రీనివాస్ అప్పటి స్టేషన్‌ఘన్‌పూర్ మండలం మల్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1989–90 సంవత్సరం చదువుకున్నాడు. ప్రస్తుతం చిల్పూరు మండలం పరిధికి చేరిన మల్కాపూర్ ఉన్నత పాఠశాలకు గెజిటెడ్ హెచ్‌ఎంగా ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సోమవారం పూర్వ విద్యార్థులైన ఇల్లందుల సుదర్శన్, జనగాం యాదగిరి మాట్లాడుతూ చదువుకున్న పాఠశాలలో హెచ్‌ఎంగా ఉద్యోగం రావడం అభినందనీయమన్నారు.

### గ్రామీణ వైద్యులు సంఘటితం కావాలి

**దేవరుప్పుల:** గ్రామీణ ప్రాంత ప్రజారోగ్య పరిరక్షణకు విస్తృత సేవలందిస్తున్న గ్రామీణ వైద్యుల బతుకు భరోసా కోసం సంఘాలకు అతీతంగా సంఘటితం కావాలని గ్రామీణ వైద్యుల (ఆర్ఎంపీ, పీఎంపీ) సంఘం జిల్లా అధ్యక్షుడు పసునూరి సత్యనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నిత్యం పల్లెల్లో ఇంటింటా తిరిగి ప్రజలకు ప్రథమ చికిత్స అందిస్తున్న తమపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త సంస్కరణల పేరిట దాడులు చేసి తమ వృత్తిని నిర్వీర్యం చేసే చర్యలు తగవన్నారు. నాలుగు దశాబ్దాలకు పైగా ఇదే వృత్తిలో ఉంటూ వేలాది మంది ప్రాణాలను కాపాడుతున్నామని అన్నారు. ఉద్యమాలకు పుట్టినిల్లు అయిన జనగామ ప్రాంతం నుంచే హక్కుల సాధనకు రిలే దీక్షలు చేపట్టినట్లు వివరించారు.

### పదోన్నతుల్లో న్యాయం చేయాలి



**జనగామ రూరల్:** బీఎడ్ విద్యార్హత కలిగిన ఎస్జీటీ ఉపాధ్యాయులకు పదోన్నతుల్లో న్యాయం చేయాలని ఎస్జీటీ ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపి డీఈఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎం పదోన్నతుల్లో బీఈడీ అర్హత కలిగిన ఎస్జీటీలకు జరుగుతున్న అన్యాయాన్ని పట్టించుకోవడం లేదన్నారు. జూనియర్లకు ప్రమోషన్లు ఇచ్చి వారి ముందు 25 ఏళ్ల సీనియార్టీ ఉన్న తమకు పదోన్నతి కల్పించకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూడి సత్యనారాయణ, అంజయ్య, బిక్కోజీ, అనిల్, శ్రీనివాస్, సోమరాజు, నిమ్మజయపాల్‌రెడ్డి, భాస్కర్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

### విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి

**స్టేషన్‌ఘన్‌పూర్:** రాష్ట్రంలో విద్యాహక్కు చట్టాన్ని అమలు చేసి నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నీరటి ప్రభాకర్ అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేశారని, 1200లకు పైగా ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయన్నారు. విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయకపోవడంతో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని, ఈ మేరకు 19న నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని కోరారు.






జనగామ పట్టణంలోని ఈద్గాలో ప్రసంగిస్తున్న మత పెద్ద, ప్రార్థనల అనంతరం ముస్లింలతో డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



ప్రార్థన చేస్తున్న ముస్లింలు



## అల్లాహ్ స్మరణలో..

● భక్తి శ్రద్ధలతో బక్రీద్ వేడుకలు

జిల్లా వ్యాప్తంగా సోమవారం ముస్లింలు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. త్యాగానికి ప్రతీకగా నిలిచే ఈ పర్వదినం సందర్భంగా అల్లాహ్‌ను స్మరించుకున్నారు. నిరుపేదలకు ఖుర్బానీ పంపిణీ చేశారు. ఈద్గాల వద్ద ఖుత్బా(ధార్మిక ప్రసంగం)తో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలయ్ బలయ్‌తో ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం పెద్దల సమాధుల వద్ద నివాళులర్పించారు. జనగామ ఈద్గాలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో పాటు పలువురు కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. డీసీపీ పి.సీతారాం నేతృత్వంలో జనగామ పట్టణంలోని ముఖ్య కూడళ్లతో పాటు ఈద్గాలు, మజీద్‌ల వద్ద పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు చేపట్టారు. - జనగామ



- మరిన్ని చిత్రాలు 9లో

# ఆగిన 'టూరిజం'



జఫర్‌గఢ్‌లో కొండపైకి సీసీ రోడ్డు నిర్మించే ప్రదేశం



కొంత మేరకే నిర్మించిన సీసీ రోడ్డు



కొండపైన రక్షణ వలయం లేకుండా ఉన్న కోనేరు

**మూడేళ్ల క్రితం రూ.4.40 కోట్లు మంజూరు**

● ముందుకు సాగని అభివృద్ధి పనులు

● అసంపూర్తిగానే సీసీ రోడ్డు నిర్మాణం

**జఫర్‌గఢ్:** చారిత్రక ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు గత ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి ఆర్భాటంగా చేపట్టిన టూరిజం పనులు అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం మూలంగా ముందుకు సాగడం లేదు. ప్రారంభ దశలనే పనులు నిలిచిపోవడంతో స్థానికుల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జఫర్‌గఢ్‌లోని కోట కట్టడాలతో పాటు ఎత్తైన పడమరకొండపై లక్ష్మీనర్సింహస్వామి ఆలయం ఉంది. ఎంతో ప్రసిద్ధి చెందిన ఈ ఆలయానికి ఉమ్మడి జిల్లాతోపాటు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఈ ప్రాంతాన్ని టూరిజం శాఖ ద్వారా అభివృద్ధి చేసేందుకు గత ప్రభుత్వం రూ.4.40 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో లక్ష్మీనర్సింహస్వామి కొండపైకి భక్తులు వాహనాల్లో పాలగుండం వరకు వెళ్లేందుకు రోడ్డు నిర్మాణం, కొండపైన స్నానాలు చేసేందుకు దేవునిగుండం చుట్టూ మెట్ల నిర్మాణం, చుట్టూ రక్షణ వలయం ఏర్పాటు, పురాతన ఆలయాన్ని అభివృద్ధి చేయడం, ఇదే కొండపైన, కొండ దిగువ భాగాన రెండు చోట్ల పార్కుల ఏర్పాటు పనులు చేయాల్సి ఉంది. అలాగే కొండ కింద విశ్రాంతి, పరిపాలనకు సంబంధించిన భవనాలు, క్యాంటీన్ నిర్మించాల్సి ఉంది. ఈ పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన చేయాల్సిన అధికారులు కేవలం ఒక కిలోమీటర్ వరకు సీసీ రోడ్డు నిర్మించి వదిలేశారు. ఈ పనులు చేపట్టి దాదాపు మూడేళ్లు కావస్తున్నా ఇప్పటి వరకు పూర్తి కాలేదు. మిగతా పనులు సైతం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి.

**కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదు**

పనులు చేసేందుకు సదరు కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదు. కొండపైకి సీసీ రోడ్డు నిర్మించాల్సి ఉండగా కిలోమీటర్ వరకే చేపట్టారు. ఇంకా 200 మీటర్ల వరకు సీసీ రోడ్డు, అలాగే విశ్రాంతి, పరిపాలన, క్యాంటీన్ భవనాలు, కోనేరు వద్ద మెట్లు తదితర పనులు చేపట్టాల్సి ఉంది. ఈ విషయమై సదరు కాంట్రాక్టర్‌కు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. పనుల పెండింగ్ విషయంపై ఇప్పటికే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం.

- జీవన్‌కుమార్, ఆర్అండ్‌బీ డీఈ

## జనగామ డీసీపీగా రాజమహేంద్రనాయక్

**జనగామ:** జనగామ వెస్ట్‌జోన్ డీసీపీగా బి.రాజమహేంద్రనాయక్‌కు పోస్టింగ్ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న డీసీపీ పి.సీతారాంను డీజీకి రిపోర్టు చేయాలని ఆదేశాలొచ్చాయి. 2010 గ్రూప్–1 డీఎస్పీ బ్యాచ్‌కు చెందిన రాజమహేంద్రనాయక్ వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో వరంగల్ సీసీఎస్, ములుగు, మహబూబాబాద్ డీఎస్పీగా పనిచేస్తూ.. అదనపు ఎస్పీగా పదోన్నతిపై భూపాలపల్లి జిల్లాకు వెళ్లారు. అక్కడి నుంచి ఎస్పీగా ప్రమోషన్‌తో కరీంనగర్ జిల్లా ఇంటిలిజెన్స్ ఎస్పీగా వెళ్లి అక్కడే విధులు నిర్వర్తిస్తున్నారు. ఐపీఎస్‌ల బదిలీల్లో భాగంగా రాజమహేంద్రనాయక్‌కు జనగామ డీసీపీ పోస్టింగ్ ఇవ్వగా, మంగళవారం బాధ్యతలు తీసుకోనున్నారు.



రాజమహేంద్ర నాయక్

నృత్య ప్రదర్శన ఇస్తున్న పాలకుర్తి విద్యార్థినులు



### భరత నాట్య ప్రదర్శనలో చిన్నారుల ప్రతిభ

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా సోమవారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో 'భారత్ ఆర్ట్స్ అకాడమీ' ఆధ్వర్యాన రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన భరత నాట్య ప్రదర్శనలో 'ఆర్యన్ శాస్త్ర డ్యాన్స్ స్కూల్' పాలకుర్తికి చెందిన పాము సౌమ్య ఆధ్వర్యంలో విద్యార్థినులు రామగిరి హారిక, యస్మిత, ఉద్విక, లక్ష్మీప్రియ, నీలామృత పాల్గొని ప్రతిభ చాటారు. - పాలకుర్తి

# అవి పోషకాలు కలిగిన బియ్యం..

● అవగాహన లేక అమ్ముతున్న లబ్ధిదారులు

**చిల్పూరు:** చౌక ధరల దుకాణాల్లో ఉచితంగా అందిస్తున్న దొడ్డు బియ్యంలో పోషకాలు కలుపుతున్నారు. అవగాహన లేక చాలా మంది ప్లాస్టిక్ బియ్యం అనుకుని వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ప్రజలకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సాధారణ బియ్యంలో పోషకాలు కలపడానికి అన్ని రైస్ మిల్లుల్లో బ్లెండింగ్ యూనిట్లు ఏర్పాటు చేయించింది. ఈ బియ్యం తింటే మహిళల్లో రక్తహీనత తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు.

**ఇవీ పోషకాలు..**

పోషకాలు కలిగిన ఈ బియ్యంలో బీ–12 ఐరన్, పోలిక్ యాసిడ్లు ఉంటాయి. ఇవి నరాల పటిష్టత, రక్తం వృద్ధి చెందడానికి, మెదడు సక్రమంగా పని చేయడానికి ఉపయోగపడతాయి. వీటిని ముఖ్యంగా అంగన్‌వాడీ సెంటర్లకు సరఫరా చేస్తున్నారు. రేషన్ షాపుల నుంచి బియ్యం తీసుకెళ్లిన వారు వాటిని కడిగే ముందు కొన్ని గింజలు తేలుతాయి. వాటిని ప్లాస్టిక్ బియ్యంగా భావించి తీసి పారేస్తున్నారు. అలా తేలిన బియ్యమే పోషకాలు కలిగినవని గుర్తించాలని అంటున్నారు.




రేషన్ షాపులో పోషకాలు కలిగిన బియ్యాన్ని చూపిస్తున్న లబ్ధిదారులు (ఫైల్)

**2424.803 ఎంటీ బియ్యం సరఫరా..**


జిల్లాలో మొత్తం 335 రేషన్ షాపులు, తెల్ల రేషన్ కార్డులు 1,61,147 లక్షలు ఉన్నాయి. రేషన్ షాపులకు 2424.803 ఎంటీ బియ్యాన్ని నెలనెలా సరఫరా చేస్తున్నారు.

**రేషన్ షాపుల్లో అవగాహన కల్పిస్తున్నాం..**



ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15 వరకు రేషన్ షాపుల్లో బియ్యం పంపిణీ చేసే ముందు సంబంధిత అధికారులతో పాటు, డీలర్ల ద్వారా బియ్యం తీసుకునే వారికి అవగాహన కల్పిస్తున్నాం. వీటిలో పోషకాలు ఉంటాయని, వ్యాపారులకు విక్రయించకుండా వండుకుని తినాలని చెబుతున్నాం. - సరస్వతి, తహసీల్దార్

**ప్రతి ఒక్కరూ తినాలి**



ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రేషన్ బియ్యంలో పోషకాలు కలిపిస్తున్నది. ఇవి ఫోర్టిఫైడ్ బియ్యం యొక్క గుణాలు కలిగి ఉంటాయి. ఇకనైనా అవగాహన కలిగి ఉండి అమ్ముకోకుండా ప్రతి ఒక్కరూ వినియోగించాలి. - రోజారాణి, డీసీఎస్ఓ

# ముసురు వర్షమే..

● భారీ వాన కోసం రైతన్న ఎదురుచూపు

● జిల్లాలో సగటు వర్షపాతం 3.2 మిల్లీమీటర్లు నమోదు

**జనగామ:** తొలకరి పలకరింపుతో జిల్లాలో భారీ వర్షాలు కురిసిన దాఖలాలు లేవు. వానాకాలం సీజన్‌లో పత్తి, వరి, మొక్కజొన్న, కందులు, ఇతర ఆరుతడి పంటల సాగు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. తొలకరితో పనులు ప్రారంభించిన రైతులు.. ఇప్పటి వరకు ఆశించిన మేర వానలేక ఆందోళనకు గురవుతున్నారు. వారం రోజులుగా ఉరుములు, మెరుపులతో ఊరిస్తూ.. ఆకాశం మేఘావృతమై ముసురు వానతో సరిపెడుతోంది. జిల్లాలో 80 మిల్లీమీటర్లకు పైగా వర్షం కురవడంతో నాటిన విత్తులకు ఎటువంటి ఇబ్బంది లేదని వ్యవసాయ అధికారులు చెబుతున్నప్పటికీ.. రైతులు వరుణ దేవుడి కోసం ప్రార్థిస్తున్నారు. చాలా చోట్ల పత్తి విత్తులు నాటగా.. నార్ల నుంచి నాట్ల వరకు పనులు జరుగుతుండడంతో రోజువారీగా సాగునీటి వినియోగం పెరుగుతోంది. దీంతో బోరు బావులు గ్యాప్ ఇస్తున్నాయి. గోదావరి జలాలతో రిజర్వాయర్లలోకి వరద నీరు చేరి.. అక్కడి నుంచి చెరువులు, కుంటలకు నీటిని విడుదల చేస్తేనే భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుంది. ఇదంతా భారీ వర్షాలతోనే సాధ్యమవుతుందని భావిస్తున్న అన్నదాతలు.. నిత్యం వరుణ దేవునికి పూజలు చేస్తున్నారు.



జనగామ జిల్లా కేంద్రంలో కురుస్తున్న వర్షం..



బచ్చన్నపేటలో..

**మండలాల వారీగా వర్షపాతం..**

జిల్లాలో సోమవారం బచ్చన్నపేటలో 32.3, లింగాలఘణపురంలో 9.5, దేవరుప్పులలో 1.0, నర్మెటలో 05 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు వెల్లడించారు. రాత్రి 7 గంటల వరకు జిల్లాలో సగటున 3.2 మిలీమీటర్ల వర్షం నమోదైందని చెప్పారు. ఈ నెల 11న 3.7, 12న 3.7, 13న 5.3, 14న 10.7, 15న 10.7, 16న 7.4, 17వ తేదీన 3.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వివరించారు.

### సీసీఐ జాతీయ సమావేశాలకు చక్రపాణి

**వరంగల్:** కేంద్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిన క్రమంలో కన్స్యూమర్ కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) న్యూఢిల్లీలో ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న వినియోగదారుల జాతీయ కమిటీ కార్యవర్గ సమావేశాలకు తెలంగాణ రాష్ట్రం నుంచి వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి హాజరుకానున్నారు. ఈ సీసీఐ సమావేశాలకు చక్రపాణితో పాటు రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్, క్యాట్కో చైర్మన్ శంకర్‌లాల్ చౌరాసియా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూరుగుపల్లి శ్రవణ్‌కుమార్ తదితరులు హాజరుకానున్నారు.

## సమస్యల పరిష్కారానికే 'విద్యుత్' ప్రజావాణి

● డీఈ హుస్సేన్‌నాయక్

**స్టేషన్‌ఘన్‌పూర్:** వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు టీజీ ఎన్పీడీసీఎల్ డీఈ ఎం.హుస్సేన్‌నాయక్ అన్నారు. స్థానిక డీఈ కార్యాలయంతో పాటు ఈఆర్ఓ కార్యాలయం, సెక్షన్, సబ్‌డివిజన్ కార్యాలయాల్లో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం ప్రతీ సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందని, మొదటి రోజు దాదాపు 25 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న డీఈ హుస్సేన్‌నాయక్

ప్రధానంగా విద్యుత్ బిల్లులు, మీటరింగ్, పేరు మార్పిడి, మీటర్ల మార్పు తదితరాలపై అర్జీలు వచ్చాయని, వాటిని వెంటనే పరిష్కరిస్తామని డీఈ హుస్సేన్ నాయక్ చెప్పారు.

# సదరం 'స్లాట్' కష్టాలు

● ఈ–సేవ వద్ద గంటల తరబడి నిరీక్షణ

**జనగామ:** జిల్లా కేంద్రం పోలీస్‌స్టేషన్ ఏరియా ఈ–సేవ కేంద్రం సోమవారం మూసి ఉండడంతో సదరం స్లాట్ బుకింగ్ కోసం వచ్చిన బాధితులు నానా ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న 27వ వార్డు కౌన్సిలర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్తా అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేశారు. స్పందించిన అదనపు కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లకు ఫోన్ చేసి మాట్లాడారు. చాలామంది మధ్యాహ్నం వరకు నిరీక్షించి వెనుదిరిగారు. సదరం డీపీఎం వినతి మాట్లాడుతూ ఈ–సేవ కేంద్రం మూసి ఉన్న విషయం తమ దృష్టికి రాలేదన్నారు. నూతన నిబంధనల ప్రకారం కొత్తగా సదరం స్లాట్ బుకింగ్ కోసం మీ సేవ కేంద్రానికి ఎప్పుడైనా వెళ్లవచ్చని, రెన్యూవల్‌కు మాత్రం స్లాట్ బుకింగ్‌కు అవకాశవ ఇచ్చిన సమయంలోనే హాజరు కావాల్సి ఉంటుందని పేర్కొన్నారు.



ఈ సేవ సెంటర్ వద్ద నిరీక్షిస్తున్న బాధితులు

# పంచాయతీ కార్యదర్శిపై దాడి

● పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు

**జనగామ రూరల్:** కోర్టు ఉత్తర్వుల మేరకు ఇంటి నిర్మాణం నిలిపివేయాలని యజమానికి తెలిపిన పంచాయతీ కార్యదర్శిపై దాడి జరిగింది. ఈ ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఎర్రగొల్లపహాడ్ గ్రామంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరగోని యాదగిరి, శ్రీహరి (అన్నదమ్ములు) మధ్య భూతగాదా ఉంది. ఈ క్రమంలో యాదగిరి ఇల్లు నిర్మించుకుంటున్నాడు. అయితే ఈ విషయంలో శ్రీహరి హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నాడు. ఇదే విషయం పంచాయతీ కార్యదర్శి ఎం.సాంబయ్య ఉన్నతాధికారులకు తెలుపగా కోర్టు నింబధనల ప్రకారం ఇంటి పనులు నిలిపివేయాలని తెలిపారు. కాగా, ఆదివారం సెలవుదినం కావడంతో పనులు నిర్వహించొద్దని పంచాయతీ కార్యదర్శి.. యాదగిరి ఇంటికి వెళ్లాడు. అక్కడ యాదగిరి భార్య కళావతి.. పంచాయతీ కార్యదర్శిపై దాడి చేసింది. యాదగిరి కుమారుడు కూడా కర్రతో దాడి చేయడానికి రాగా పంచాయతీ కార్యదర్శి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అనంతరం తనకు ప్రాణభయం ఉందని బాధితుడు సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై భరత్ తెలిపారు. కాగా, ఎర్రగొల్లపహాడ్ పంచాయతీ కార్యదర్శి ఎం.సాంబయ్యపై దురుసుగా ప్రవర్తించిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని పూసల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ శ్రీనివాస్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

## గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై, సిబ్బంది

**కాళేశ్వరం :** మహదేవపూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమ గోదావరిలో స్నానానికి వెళ్లి గల్లంతైన యువకుడు గరికపాటి అఖిల్‌కుమార్(19) మృతదేహం సోమవారం లభ్యమైంది. ఎస్సై భవానీసేన్ కథనం ప్రకారం.. వరంగల్ లేబర్‌కాలనీకి చెందిన ప్రవీణ్, రజనీ దంపతుల కుమారుడు అఖిల్‌కుమార్‌తో కలిసి తల్లి రజనీ, మేనత్త స్వాహ ఇతర కుటుంబ సభ్యులు ముక్తీశ్వరుడిని దర్శించుకోవడానికి ఆదివారం కాళేశ్వరం వచ్చారు. గోదావరిలో స్నానాలు చేస్తుండగా అఖిల్‌కుమార్ నీటి లోతులోకి జారిపోయాడు. జాలర్లు ఎంత గాలించిన ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో సోమవారం ఉదయం మృతదేహంపైకి తేలి కనిపించింది. దీంతో కుటుంబసభ్యులు చూసి బోరున విలపించారు. మహదేవపూర్ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం..

**కేసముద్రం:** మండలంలోని పెనుగొండ సమీపంలో ఆదివారం ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్సై వంశీధర్ కథనం ప్రకారం.. మృతుడు ఇటీవల గ్రామంలో సంచరించాడు. ఈ క్రమంలో లక్ష్మీపురం రోడ్డువైపు ఉన్న వట్టివాగు సమీపంలో మృతి చెందగా స్థానికులు గుర్తించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. కాగా, మృతుడి వయసు 48 సంవత్సరాలు ఉంటుందని ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మానుకోట జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## విద్యుదాఘాతంతో యువకుడి మృతి



నిశాంత్(ఫైల్)

**మల్హర్ :** విద్యుదాఘాతంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని రుద్రారంలో చోటు చేసుకుంది. కొయ్యూరు ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నిశాంత్ (30) సోమవారం ఉదయం 7 గంటల సమయంలో తన ఇంట్లో మోటార్‌కు కరెంట్ వైర్ సరి చేస్తున్నాడు. ఈ క్రమంలో కరెంట్ సరఫరా కావడంతో షాక్ తగిలి కింద పడిపోయాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం భూపాలపల్లి ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే నిశాంత్ మృతి చెందాడని ధ్రువీకరించారు. ఈ ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, నిశాంత్‌కు 4నెలల క్రితం వివాహం జరిగింది. అతడి మృతితో కుటుంబంతోపాటు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.




# హైపర్.. హైపవర్

- విద్యుత్ సంబంధ నష్టాలకు హైపర్ ప్రణాళికతో వెంటనే చెక్
- విపత్తు ఎదుర్కొనేందుకు టీజీ ఎన్పీడీసీఎల్ ప్రత్యేక కార్యచరణ
- యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ చర్యలు

**హన్మకొండ :** వినియోగదారులకు నాణ్యమైన, మెరుగైన, అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం ముందుచూపుతో వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగా 'హైపర్' ప్రణాళిక రూపొందించి ముందుకెళ్తోంది. ఈదురుగాలులు, భారీ వర్షాల వంటి విపత్తు పరిస్థితులు నెలకొన్నప్పుడు సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రతి ఉద్యోగి పని చేసే చోట నివాసముండడం, తన బాధ్యతను సక్రమంగా, సమర్థవంతంగా, అంకితభావంతో నిర్వహించడం, అవసరమైన మానవ వనరులు, మెటీరియల్ అందుబాటులో ఉంచుకోవడం, సత్వర సమాచార సేకరణ వంటి సౌకర్యాలతో కూడుకున్న ప్రణాళికే హైపర్.

**విద్యుత్ పునరుద్ధరణకు వెంటనే చర్యలు**

విద్యుత్ సంబంధ నష్టాలు జరిగితే వెంటనే పునరుద్ధరించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంది. ఈ వర్షాకాలంలో ఎలాంటి అవాంతరాలు ఎదురైనా ఎదుర్కొనేందుకు అధికారులు, సిబ్బందిని సమాయత్తం చేసింది. ఈదురుగాలులు, భారీ వర్షాలు వచ్చి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే కనిష్ఠ స్థాయిలో యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు హైపర్ పేరుతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఏ సమయంలోనైనా విపత్తు ద్వారా విద్యుత్ లైన్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ సబ్ స్టేషన్లకు నష్టం వాటిల్లితే అధికారులు, సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి వాటిని పునరుద్ధరిస్తారు.





హైపర్ లోగో

**కార్యాచరణ నిరంతరం మెరుగు..**

టీజీ ఎన్పీడీసీఎల్.. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి కార్యాచరణను నిరంతరం మెరుగుపరుచుకుంటూ గణనీయ అభివృద్ధి సాధించే దిశగా సాగుతోంది. మేలో కురిసిన అకాల వర్షాలకు ఎన్పీడీసీఎల్ పరిధిలో విద్యుత్ లైన్లకు నష్టం వాటిల్లింది. ఈదురు గాలులకు చెట్లు కూలి కొమ్మలు విరిగి విద్యుత్ లైన్లపై పడడంతో విద్యుత్ లైన్లు తెగిపడ్డాయి. స్తంభాలు విరిగిపోయాయి. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల నష్టం వాటిల్లింది. ప్రధానంగా మే 13న పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ఉండగా మే 12న ఈదురు గాలులు వీచి భారీ వర్షాలకు లైన్లకు నష్టం జరిగి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రయోగాత్మకంగా హైపర్ కార్యాచరణతో ముందుకెళ్లి రాత్రంతా పని చేసి పోలింగ్ సమయానికి ముందే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. పోలింగ్‌కు ఎలాంటి అవాంతరాలు ఎదురుకాకుండా విద్యుత్ సరఫరా చేశారు.

**అతి తక్కువ సమయంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు హైపర్**



ఈదురుగాలులు, భారీ వర్షాల వంటి విపత్తులు ఏర్పడి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే అతి తక్కువ సమయంలో కరెంట్ సరఫరాను పునరుద్ధరించేందుకు 'హైపర్' అనే కార్యాచరణ రూపొందించాం. ఇది సత్ఫలితాలు ఇస్తోంది. వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన, అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించుకుని ముందుకెళ్తున్నాం. ఈ మేరకు మెటీరియల్‌ను అందుబాటులో ఉంచుతున్నాం. ఉద్యోగులకు అవసరమైన శిక్షణ ఇచ్చాం. దీంతో ఫలితాలు సాధిస్తున్నాం.

-కర్నాటి వరుణ్ రెడ్డి, సీఎండీ, టీజీ ఎన్పీడీసీఎల్

## విద్యుత్ ప్రమాదాలు నివారించాలి

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

**పరకాల:** క్షేత్రస్థాయిలో ప్రతి ఉద్యోగి భద్రతా చర్యలు చేపట్టి విద్యుత్ ప్రమాదాలను నివారించాలని టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశించారు. టీజీ ఎన్పీడీసీఎల్ సర్కిల్ పరిధిలోని పరకాల సబ్ డివిజన్‌లో సోమవారం 'విద్యుత్ ప్రజావాణి' కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం సబ్ స్టేషన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ప్రజావాణి వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక అన్నారు. డివిజన్, ఈఆర్‌ఓ, సబ్ డివిజన్ ఆఫీస్, సెక్షన్ ఆఫీస్‌లలో ప్రతి సోమవారం ఉదయం 10గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని, దీనిని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టీజీ ఎన్పీడీసీఎల్ ప్రమాదాల రహిత విద్యుత్ సంస్థగా తీర్చిదిద్దేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తామన్నారు. ఉద్యోగులు భద్రత పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో హనుమకొండ సర్కిల్ ఎస్ఈ కె.వెంకటరమణ, టెక్నికల్ డీఈ అనిల్‌కుమార్, ఏడీఈ దేవేందర్, ఏఈ సత్యనారాయణ, ఏఏఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



పరకాల సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

## స్నేహితులను కలిసేందుకు వచ్చి మృత్యుఒడికి..

- రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం
- చిట్యాల వద్ద ఘటన



అరుణ్ కుమార్ (ఫైల్)

**పెద్దవంగర:** స్నేహితులను కలిసేందుకు వచ్చి తిరుగు ప్రయాణంలో ఓ యువకుడు మృత్యుఒడికి చేరారు. రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం చిట్యాల శివారులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా నాగారం మండలం పస్తాల గ్రామానికి చెందిన బొజ్జా సరిత, శ్రీనివాస్(లేట్) దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. మొదటి సంతానం అరుణ్ కుమార్ (20) తొర్రూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో ఐటీఐ సెకండియర్ చదువుతున్నాడు. అరుణ్ కుమార్ తండ్రి శ్రీనివాస్ పదేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా తల్లి సరిత ఇద్దరి కుమారులను తీసుకుని జనగామ జిల్లా కొడకండ్ల మండలం నర్సింగాపురంలో తల్లి గారి ఇంటి వద్ద ఉంటుంది. ఐదేళ్ల క్రితం చిన్న కుమారుడు అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మనస్తాపం చెందిన సరిత అక్కడి నుంచి హైదరాబాద్‌కు వలస వెళ్లింది. అక్కడ ఇండ్లలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. కాగా, తన తల్లిగారి ఇంటి వద్ద ఉంటూ చదువుకుంటున్న అరుణ్.. ఆది, సోమవారాలు సెలవు ఉండడంతో ఆదివారం చిట్యాలలో ఉంటున్న తన స్నేహితుల వద్దకు వచ్చాడు. తిరుగు ప్రయాణంలో మలుపు వద్ద బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాత్రి కావడంతో ఎవరూ గమనించ లేదు. సోమవారం ఉదయం అటుగా వెళ్తున్న రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు కుటుంబీకులకు సమాచారం చేరవేశారు. ఈ ఘటనపై తల్లి సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. కాగా, పదేళ్ల క్రితం భర్త, ఐదేళ్ల క్రితం కుమారుడు, ప్రస్తుతం మరో కుమారుడు మృతి చెందడంతో తల్లి సరిత గుండెలవిసేలా రోదించింది. ఇక తనకు దిక్కెవరంటూ కన్నీరుమున్నీరుగా విలపించింది. ఈ ఘటన ప్రతి ఒక్కరిని కలిచివేసింది.

## ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**విద్యారణ్యపురి:** హైదరాబాద్‌లోని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సివిల్ సర్వీస్ అప్టిట్యూడ్ టెస్టు 2024-2025 విద్యాసంవత్సరంలో ప్రవేశానికి సంబంధించి నిర్వహించే ప్రిలిమినరీ పరీక్షకు నిరుద్యోగులైన అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ , మైనార్టీ వర్గాలకు చెందిన వారు ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ గౌరవ సంచాలకుడు కె జగన్‌మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయంలో డిగ్రీ ఉత్తీర్ణులైన వారు హెచ్‌టీటీపీ //టీఎస్‌స్టడీసర్కిల్.కో.ఇన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో జూలై 10వతేదీవరకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు జూలై 27న ఎంపిక పరీక్షను నిర్వహిస్తారని తెలిపారు. ఈ ప్రవేశపరీక్షలో పొందిన మెరిట్ ప్రాతిపదికనే అర్హులైన అభ్యర్థులకు ప్రవేశాలు కల్పిస్తారని ఆయన తెలిపారు. ఎస్సీస్టీ స్టడీ సర్కిల్ బంజారాహిల్స్‌హైదరాబాద్‌లో సివిల్ సర్వీస్ ప్రిలిమినరీ పరీక్షకు ఉచిత వసతి భోజనంతోపాటుశిక్షణ ఇస్తారని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆయా అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పూర్తి వివరాలు సంబంధిత వెబ్‌సైట్‌లోనే ఉన్నాయన్నారు.

# ప్రమాదం మిగిల్చిన గాయం

**బాలిక జీవితాన్ని చిదిమేసిన రోడ్డు ప్రమాదం**

- మంచానికే పరిమితమైన అక్షయ
- ఏడాదికి రూ.3లక్షలకు పైగా ఖర్చు
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు

దీన గాథ



రోడ్డు ప్రమాదానికి ముందు అక్షయ



మంచం పట్టిన బిడ్డకు సపర్యలు చేస్తున్న తల్లి

**దకురవి:** అల్లారుముద్దుగా పెంచుకుంటున్న ఆడబిడ్డ బంగారు భవిష్యత్‌ను రోడ్డు ప్రమాదం చిదిమేసింది.. కళ్లెదుట ఆడుతూ.. పాడుతూ.. చదువులో రాణిస్తున్న కన్న బిడ్డను చూసి మురిసిపోతున్న ఆ తల్లిదండ్రులకు పెద్దకష్టం వచ్చింది.. రోడ్డు ప్రమాదం కారణంగా నరాల బలహీనతతో కాళ్లు చేతులు పడిపోయి మంచానికే పరిమితమైంది ఆ పసిప్రాణం. ప్రమాదం మిగిల్చిన గాయం నరాల బలహీనతతో 14ఏళ్లకే మాటలు కూడా రాక ఆచేతన స్థితిలో పడిపోయింది. ఏడాదికి రూ.3లక్షలకు పైగా ఖర్చు చేసినా.. కోలుకోలేని స్థితిలో ఉన్న బాలిక దీనగాథపై 'సాక్షి' కథనం.

మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కొత్తూరు (సీ) శివారు గుజిలి తండాకు చెందిన జాటోత్ శంకర్- సుజాత దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. అక్షయ వయసు 14 ఏళ్లు. బయ్యారం మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకులంలో చదువుకుంటుంది. ఈ క్రమంలో 2022లో భద్రాద్రి కొత్తగూడెంలోని బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లారు. కొత్తగూడెం సమీపంలోని చుంచుపల్లి పోలీస్‌స్టేషన్ సమీపంలో రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్షయకు తీవ్రగాయాలయ్యాయి. కొత్తగూడెం పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం డాక్టర్ల సూచన మేరకు హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ మేరకు డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి అక్షయ మెదడులోని రక్తనాళాలు పనిచేయడం లేదని, ఆపరేషన్ చేయడం కుదరదని తెలిపారు. కేవలం మందులతో నయం అవుతుందని చెప్పారు. దీంతో అక్షయను ఆస్పత్రి నుంచి ఇంటికి తీసుకొచ్చారు. నరాలబలహీనత తీవ్రం కావడంతో కాళ్లు, చేతులు పడిపోయి మంచానికే పరిమితమైంది. దీంతో నెలనెలా మందుల కోసం తల్లిదండ్రులు అప్పు చేస్తున్నారు. ప్రస్తుతం బాలిక మాట్లాడలేని పరిస్థితికి చేరుకుంది. నెలకు రూ.25వేల ఖర్చు భరించడం కష్టంగా మారిందని దాతలు ఆదుకోవాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. కూలి పనిచేస్తే వచ్చే డబ్బుతో బతకడం కష్టంగా మారిందని, బిడ్డ జబ్బు నయం కోసం రూ.25వేలు వెచ్చించడం పెనుభారంగా మారిందని విలపిస్తున్నారు.

**సాయం అందించాల్సిన ఫోన్‌నంబర్ 93466 20224**

## మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట

- మంత్రి కొండా సురేఖ, ఎంపీ కావ్య

**ఖిలా వరంగల్:** ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. బక్రీద్ పర్వదినం సందర్భంగా సోమవారం వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై ఖిలా వరంగల్ పెట్రోల్ బంక్ జంక్షన్‌లోని ఈద్గాలో ముస్లింలు ఉదయం 9 నుంచి 10గంటల వరకు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. చార్‌బౌలి, ఎల్‌బీనగర్, శివనగర్, రంగశాయిపేట, శంభునిపేట, శాంతినగర్, ఏకశిలనగర్, కరీమాబాద్, చింతల్ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ముస్లింలు ఈద్గా చేరుకుని సామూహిక ప్రార్థనలు చేశారు. మంత్రి కొండా సురేఖ, ఎంపీ కడియం కావ్య ముఖ్య అతిథులుగా హాజరై ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ఆరు గ్యారంటీలు పక్కాగా అమలు చేస్తామని, ముస్లిం మైనార్టీల సంక్షేమమే ధ్యేయంగా ప్రత్యేక పథకాలు అమలు చేయనున్నామని పేర్కొన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి హయాంలో తీసుకొచ్చిన రిజర్వేషన్లతో ఎందరో ముస్లింల జీవితాలు బాగుపడ్డాయని తెలిపారు. పలు రంగాల్లో ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపుతామని, ఈద్గా అభివృద్ధి మరింతగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి కొండా సురేఖను ఎంఏ జబ్బార్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఈద్గా మత గురువు మౌలానా మహ్మద్ నౌమాన్ రాజా, కేర్‌టేకర్ ఎంఏకే తన్వీర్, మాజీ కార్పొరేటర్లు బైరబోయిన దామోదర్, బాసాని శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు కేడల జనార్దన్, మీసాల ప్రకాశ్, ఎండీ ఆయూబ్, సిద్ధం రాము, అమ్జద్, తదితరులు పాల్గొన్నారు.



ఈద్గా సామూహిక ప్రార్థనలో ఎంపీ కావ్యతో కలిసి మాట్లాడుతున్న, మంత్రి కొండా సురేఖ

## మద్యం తాగొద్దని మందలించినందుకు..

- వ్యక్తి ఆత్మహత్య.. శ్రీరామ్‌నగర్‌లో ఘటన



ప్రసాద్(ఫైల్)

**వాజేడు:** మద్యం తాగొద్దని భార్య మందలించడంతో క్షణికావేశాని గురైన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని శ్రీరామ్‌నగర్ చోటు చేసుకుంది. వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పూనెం ప్రసాద్(50)కు గతంలో శ్రీదేవితో పెళ్లి జరిగింది. అయితే మనస్పర్థల కారణంగా ఇద్దరు విడిపోయారు. అనంతరం వాజేడుకు చెందిన మడప అనూషతో ప్రసాద్‌కు 10 సంవత్సరాల క్రితం పెళ్లి జరిగింది. ప్రసాద్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో రోజూ మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడేవాడు. దీంతో మద్యం తాగొద్దని అనూష పలుమార్లు మందలించినా మారడం లేదు. సోమవారం ఉదయం కూడా మద్యం సేవించి ఇంటికి రావడంతో అనూష మరోసారి మందలించింది. దీంతో క్షణికావేశానికి గురైన ప్రసాద్ మద్యం మత్తులో పురుగుల మందు తాగి గ్రామ శివారులో ఉన్న రైతు వేదిక వద్ద పడి ఉన్నాడు. గమనించిన బంధువులు వెంటనే ఏటూరునాగారం ఏరియా వైద్యశాలకు తరలించగా వైద్యం పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి మొదటి భార్య శ్రీదేవి కుమారుడు హేమంత్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, ప్రసాద్ చెరుకూరు జీపీలో మల్టీ పర్పస్ వర్కర్‌గా పని చేస్తున్నాడు.

## పీహెచ్‌డీ వేకెన్సీలన్నీ భర్తీ చేయాలి

- సీట్ల భర్తీపై రిజిస్ట్రార్‌తో ఆశావహ అభ్యర్థుల వాగ్వాదం

**కేయూ క్యాంపస్ :** కాకతీయ యూనివర్సిటీలోని వివిధ విభాగాల్లో పీహెచ్‌డీ కేటగిరీ -1లో మిగిలిన వేకెన్సీతోపాటు ఇప్పటి వరకు ఉన్న పీహెచ్‌డీ వేకెన్సీ కూడా భర్తీచేయాలని డిమాండ్ చేస్తూ పలువురు పీహెచ్‌డీ ఆశావహ అభ్యర్థులు సోమవారం క్యాంపస్‌లో రిజిస్ట్రార్ మల్లారెడ్డితో వాగ్వాదానికి దిగారు. గతంలో పీహెచ్‌డీ కేటగిరి-1 అడ్మిషన్లు కల్పించాక మిగిలిన సీట్లను ఇప్పుడు పీహెచ్‌డి కేటగిరీ -2లోకి మార్పు చేసి మెరిట్ కమ్ రిజర్వేషన్ ప్రకారం అధికారులు అడ్మిషన్లు కల్పించబోతున్నారు. అయితే యూనివర్సిటీలోని వివిధ విభాగాల్లో ఇప్పటి వరకు పీహెచ్‌డీ -2 కేటగిరీ కింద ఉన్న వేకెన్సీలన్నింటినీ భర్తీచేయాలని ఆశావహ అభ్యర్థులు డిమాండ్ చేస్తూ రిజిస్ట్రార్ మల్లారెడ్డితో వాగ్వాదానికి దిగారు. ఉన్నత విద్యామండలి నివేదిక ఆధారంగా సీట్లు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పీహెచ్‌డీ-2 కేటగిరీ ప్రవేశపరీక్షలో అర్హత సాధించినవారికి సీట్లు ఇవ్వాలని పేర్కొన్నారు. అవసరమైతే సూపర్ న్యూమరీ కోటా కింద అభ్యర్థులకు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం రిజిస్ట్రార్ పి మల్లారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌డీ ఆశావహ అభ్యర్థులు ఎండీ పాషా, మట్టెడ కుమార్, బొట్ల మనోహర్, మంద భాస్కర్, మోతెరాజు, లంక రాజగోపాల్, అంకిళ్ల శంకర్, పి జగదీష్, కె తిరుపతి, బంధీగా రాకేష్, గణేష్, అజయ్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



రిజిస్ట్రార్ మల్లారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పీహెచ్‌డీ ఆశావహ అభ్యర్థులు

## అక్క కోసం వెళ్తే బావ చంపాడు

- బావచేతిలో బామ్మర్ది హతం
- దంటకుంట తండాలో ఘటన



పాండు (ఫైల్)

**మరిపెడ రూరల్:** అక్కాబావ ఘర్షణ పడుతుండగా మధ్యలో వెళ్లిన బామ్మర్ది.. బావ చేతిలో హత్యకు గురయ్యాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం దంటకుంటతండాలో చోటు చేసుకుంది. మరిపెడ ఎస్సై సంతోష్ కథనం ప్రకారం.. మండలంలోని వెంకట్యతండా జీపీకి చెందిన గుగులోత్ లక్ష్మిని 25 ఏళ్ల క్రితం ఇదే మండలం దంటకుంటతండాకు చెందిన భూక్య మంత్రికి ఇచ్చి వివాహం జరిపించారు. ఈ క్రమంలో ఇటీవల దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం మరోసారి ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో భర్త కొడుతున్నాడని లక్ష్మి ఫోన్ చేసి తన సోదరులకు చెప్పింది. ఆమె పెదనాన్న కుమారుడు గుగులోత్ పాండు (35) అతడి భార్య మంగ, ఆమె తమ్ముడు మురళి, తల్లి సాల్కు నాలుగురు కలిసి రెండు ద్విచక్ర వాహనాలపై అదేరోజు రాత్రి దంటకుంటతండాకు వచ్చారు. గొడవపై బావను నిలదీస్తున్న క్రమంలో మాటామాట పెరిగి ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. ఇందులో ఓ బామ్మర్ది మద్యం బాటిల్ తీసుకుని బావ తలపై కొట్టాడు. తేరుకున్న అనంతరం కోపోద్రిక్తుడైన బావ.. బామ్మర్ది పాండు తలపై కర్రతో మోదాడు. దీంతో తలకు తీవ్ర గాయాలైన పాండును స్థానికులు హైదరాబాద్ తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మరిపెడ సీఐ హతీరాంనాయక్ దంటకుంటతండాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనతో వెంకట్యతండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## పాపం.. పసికందు

- రైలు పట్టాల మధ్యలో నవజాత శిశువు మృతదేహం
- మహబూబాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో ఘటన



మార్చురీ గదిలో భద్రపరిచిన మగశిశువు మృతదేహం

**మహబూబాబాద్ రూరల్ :** పాపం.. పసికందు. ఇష్టం లేకనో.. లేదా ఇప్పుడే వద్దనుకున్నారేమో తెలియదు కానీ అభం శుభం తెలియని నవజాత శిశువు మృతదేహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు రైలు పట్టాల మధ్యలో పడేశారు. ఈ అమానవీయ ఘటన మహబూబాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలోని అండర్ బ్రిడ్జిపై భాగం ప్రాంతంలో సోమవారం ఉదయం వెలుగుచూసింది. జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం.. రైల్వే కీమెన్ సుధాకర్ విధి నిర్వహణలో భాగంగా ఆదివారం సాయంత్రం డౌన్ లైన్‌లో ట్రాక్ పరిశీలిస్తూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో రైల్వే స్టేషన్ పరిధిలోని అండర్ బ్రిడ్జిపై భాగం ప్రాంతంలో ఒక కవర్ మూటకట్టి ఉండగా గుర్తించాడు. దానిని పరిశీలించి చూడగా అందులో అప్పుడే జన్మించిన మగ శిశువు మృతదేహం కనిపించింది. వెంటనే ఆ సమాచారాన్ని రైల్వే స్టేషన్ మాస్టర్ రోహిత్ కుమార్‌కు తెలియజేయగా.. ఆయన ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులకు సమాచారం ఇచ్చారు. జీఆర్పీ ఎస్సై సురేశ్ సూచన మేరకు ఆ సమయంలో విధుల్లో ఉన్న కానిస్టేబుల్ గాంధీ పంచనామా నిర్వహించి మగ శిశువు మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మార్చురీ గదికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆర్ఎంఓ జగదీశ్వర్ మాట్లాడుతూ పిల్లలను సాకలేని వాళ్లు, అవసరం లేని వాళ్లు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని ఉయ్యాలలో వదిలివెళ్లాలని సూచించారు. వారిని ఐసీడీఎస్ సంరక్షణకు పంపిస్తామని, చెత్త కుప్పల్లో, రహదారుల పక్కన, రైలు పట్టాలపై వదిలివేసి మాతృత్వానికి మచ్చ తీసుకురావొద్దని విజ్ఞప్తి చేశారు.


# విద్యారంగంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

- రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క

**మరిపెడ:** విద్యారంగంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ఈ మేరకు సోమవారం మరిపెడలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలను సందర్శించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ ఏడాది పాఠశాలలు ప్రారంభకాకముందే ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు, దుస్తులు అందుబాటులో ఉంచిందన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. ప్రభుత్వం అందజేస్తున్న సౌకర్యాలను విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ పాఠశాల్లో నాణ్యమైన విద్య..**

**కురవి:** ప్రభుత్వ పాఠశాల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ఐఐటీలో సీటు సాధించిన మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల/ కాలేజీ విద్యార్థిని మహేశ్వరి, ఎన్ఐటీలో సీటు సాధించిన హర్షితను సోమవారం మంత్రి సీతక్క ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన అధ్యాపకులు, ఉపాధ్యాయులు ఉంటారని తెలిపారు. ఎంపీ బలరాంనాయక్ మాట్లాడుతూ స్కూల్‌కు వేడి నీళ్లు అందించే యంత్రాలు అందజేస్తానని, కురవి మోడల్ రెసిడెన్షియల్ కళాశాలను డిగ్రీ కాలేజీగా అప్‌గ్రేడ్‌గా చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్, జెడ్పీటీసీ బండి వెంకటరెడ్డి, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఆర్‌సీఓ రాజ్యలక్ష్మి, ఆర్‌డీఓ అలివేలు, పాఠశాల ప్రిన్సిపాల్ మార్త సంతోష్, డీఎస్పీ తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రంలో నిర్మిస్తున్న గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల నూతన భవనాలను విప్, ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ పరిశీలించారు. త్వరలో పూర్తి చేసి స్కూల్‌కు అప్పగించేందుకు కృషి చేస్తానని ఆయన చెప్పారు.



కురవి: మాట్లాడుతున్న మంత్రి సీతక్క, పక్కన ఎమ్మెల్యే, ఎంపీ

**ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తాం..**

**కొత్తగూడ:** ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని మంత్రి సీతక్క అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని బత్తులపల్లి, కార్లాయి గ్రామాల్లో పర్యటించారు. రైతు రుణమాఫీ, రైతు భరోసాతో పాటు పథకాలన్నీ పటిష్టంగా అమలు చేస్తామన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు. కార్లాయిలో పలు పార్టీలకు చెందిన నాయకులు సీతక్క ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు.